కథా నిలయం
5481
శ్రీకాకుళం

# పారిజాతం

పొలిమేరలు దాటి వచ్చేసిన అనంతం, వెనక్కి తిరిగి చూశాడు.

చుట్టూ చీకటి; ఎటు చూసినా చిక్కని చీకటి. కొంత దూరంలో వూరు అగుపిస్తోంది ఓ సిల్హౌట్‌లా వుండీ వుడిగీ మిణుకు మిణుకు మంటూ వెలుగులు అగుపిస్తున్నాయి. దూరంలో కుక్కల అరుపులు, కీచు శబ్దాలు వినిపిస్తున్నాయి.

వూరికేసి చూస్తుంటే అనంతంకి యేడుపొస్తుంది. బాధగా ఓ నిశ్వాసం వదిలాడు. అతని మనోనేత్రాల్లో గతం, సినిమా రీలులా గుర్తుకొచ్చింది.

✪ ✪ ✪

పాతికేళ్ళక్రితం -

అనంతం ఆ వూళ్ళో అడుగుబెట్టాడు, భార్యా పిల్లాడితో. ప్రైమరీ స్కూలు వుపాధ్యాయుడిగా అప్పట్నుంచీ ఆ వూరునీ ఆ స్కూలునీ నమ్ముకుని బ్రతుకు సాగించాడు.

క్రమంగా ఆ స్కూలు, అభివృద్ధి జెందింది. అయితే, అనంతం మాత్రం ప్రైమరీ వుపాధ్యాయుడిగానే వుండి, నాలుగేళ్ళ క్రితం పదవీ విరమణ చేశాడు. రిటైరవ్వగా వచ్చిన డబ్బుతో ఆ వూళ్ళోనే చిన్న ఇల్లు కొనుక్కున్నాడు. అదే తన స్వస్థలం అనుకున్నాడు. ఆ భావనతోనే తృప్తిగా రోజులు గడుపుకొస్తున్నాడు.

అదృష్టవశాత్తూ, అనంతం యేకైక పుత్రుడు మధు, బి.ఇడి. పూర్తిచేసి అదే స్కూల్లో పై తరగతులకు ఉపాధ్యాయుడుగా చేరాడు. కొంప కొనుక్కోవడం, కొడుక్కి అదే స్కూల్లో వుద్యోగం దొరకడం శుభసూచకంగానూ గొప్ప అదృష్టంగానూ భావించాడు అనంతం. అయితే, ఆ భావన, ఆనందం యెన్నాళ్ళో వుండలేదతనిలో.

ఎవ్వరూ ఊహించని రీతిలో అనంతం భార్య ఆదిలక్ష్మి విషజ్వరానికి గురై అదే సంవత్సరం భర్తని ఒంటరివాణ్ణి చేసి పరలోకానికి పోవడం అనంతం గుండెల్ని పిండేసినట్లయింది. కుమిలి కుమిలి ఏడ్చాడు. భగవంతుడు తనకి అన్యాయం చేశాడని వాపోయాడు. కాని, ఏం లాభం?

కన్నీళ్ళే మిగిలాయికాని కన్నుమూసిన భార్య తిరిగి రాలేదు. బాగా డీలాపడిపోయాడు. బ్రతుకును భారంగా లాక్కొస్తున్నాడు అనంతం.

కష్టాలు ఒంటరిగా రావంటారు. నిజమేనేమో! గోరుచుట్ట మీద రోకటి పోటులా మరో సంఘటన. మధు తాను ప్రేమించి పెళ్ళి చేసుకున్నానని, పారిజాతంని ఇంటికి తీసుకొచ్చాడు నేరుగా.

"మా ఇరువురమూ పరస్పరం ప్రేమించుకున్నాం నాన్నా! దైవసాన్నిధ్యంలో పెళ్ళి కూడా చేసేసుకున్నాం. మమ్మల్ని ఆశీర్వదించండి" అంటూ పారిజాతంని ఇంటికి తీసుకొచ్చాడో రోజు. ఆ ఇరువురూ అనంతంకి పాదాభివందనం చేశారు.

అనంతం నిర్విణ్ణుడై, వాళ్ళిద్దరికేసి చూస్తూ వాళ్ళ శిరసులపై చేతులుంచడం తప్పించి, యింకేమీ అనలేని అయోమయస్థితిలో పడిపోయాడు. అతని కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లినయ్.

భార్య ఆదిలక్ష్మి సజీవంగా తన సరసన వుండివుంటే ఇదేం పనిరా వెధవా! మేం చచ్చామనుకున్నావా?' అంటూ కాస్తయినా కేకలు వేసి వుండేవాడు కాని, భార్య ఈ లోకంలో లేదిప్పుడు. తాను ఒంటరివాడు ఒకరిపై ఆధారపడి బతకవల్సినవాడు. ఇటువంటి నిస్సహాయ సమయంలో ఆగ్రహం వ్యక్తంచేసి బావుకున్నదేవిఁటి? అసలు, ప్రయోజనమేముంటుందని? తాను చెడ్డవ్వడం తప్పిస్తే జరిగిపోయినవాళ్ళ వివాహం రద్దుకాదు కదా?.... ఇలా ఆలోచించే, మౌనం వహించాడు. మనస్సుని అదుపులో పెట్టుకుని, మెల్లగా బైటికి జారుకున్నాడు అనంతం. గుమ్మం దాటాక కళ్ళొత్తుకున్నాడు.

"నిజంగా నేను భయపడ్డాను సుమండీ" అంది పారిజాతం.

"ఎందుకు" మధు ప్రశ్న.

"మీ నాన్నగారు ఉగ్ర నరసింహరూపం దాల్చి ఏమంటారోనని"

మధు తేలిగ్గా నవ్వేడు. ఆ నవ్వులో నిర్లక్ష్యం, నిర్భయత, ద్యోతకమవుతున్నాయి. "వున్నది వున్నట్టు చెప్పాలంటే, మా నాన్నగారికి నేనంటే భయం పారిజాతం. అందుకే పల్లెత్తు మాటయినా అనడానికి సాహసించలేకపోయారు" అదో గొప్ప విషయంలా, ఘనకార్యమేదో సాధించినవాడిలా, గర్వంగా చెప్పాడు మధు.

పారిజాతం ఆశ్చర్యపోయింది. కొత్త విషయం వింటున్నట్టుగా అనిపించిందామెకి. సాధారణంగా, తండ్రి దగ్గర కొడుకు భయపడ్డం చూస్తూ వచ్చింది గాని, ఇప్పుడు తాను వింటున్నది అందుకు భిన్నంగా వున్నందుకే ఆశ్చర్యపడింది.

"అది, మీ నాన్నగారి మంచితనమేమోనండీ" అంది పారిజాతం.

"అబ్బే! అదేం కాదు పారిజాతం, ఆయన నా నోటికి భయపడతారు. గంగిగోవులాంటి మనిషి కదా" సన్నగా మందహాసం చేస్తూనే అన్నాడు.

భర్త అలా చెప్పడం ఆమెకి నచ్చలేదు "గంగి గోవులాంటి మనిషని ఆయన మంచితనాన్ని ఆధారం చేసుకుని మీరలా ప్రవర్తించడం మీకు అన్యాయంగా తోచలేదూ?" సూటిగా ప్రశ్నించింది.

"ఏమీలేదు. ఇది నవీనయుగం. అణుయుగం. ఈ యుగంలో అటువంటి పాత పద్దతులు పాటించామంటే మనం తలెత్తుకోలేనంతగా అణచివేస్తారు. అందుకే ఈ విధమైన ప్రతిఘటన..." నవ్వుతూ అన్నాడు మధు.

పారిజాతంకి, భర్త ప్రవర్తన సబబుగా తోచలేదు. అయితే, తన మనసులోని మాటని, అప్పుడే బైట పెట్టలేదామె.

✪ ✪ ✪

ఆ రోజునుంచీ అనంతం ముభావంగానే వుంటున్నాడు. పరాయి ఇంటినుంచి వచ్చి తన ఇంట్లోకి అడుగుబెట్టిన కోడలు, తనని అభిమానిస్తూ ఆప్యాయంగా ఒక ఆప్తురాలిలా మాట్లాడుతూ వుండడం అనంతంకి కొంత ఉపశమనం కలిగించినా, స్వంత కొడుకు ప్రవర్తన మాత్రం అసహ్యాన్ని, బ్రతుకు పట్ల విరక్తినీ కలిగిస్తోంది. అయినా, ఓర్పుతో వెళ్లబుచ్చుతున్నాడు. గుండెల్లో రాజుకుంటోన్న అంతర్గత ఆవేదనని భరించక తప్పడం లేదతనికి. ఆ ఇంటినుంచి ఆ కొడుకు నుంచి విముక్తి పొందడానికి అతనికి మరో కొడుగ్గాని, కూతురుగాని లేరు. మధు అతనికి ఏకైక పుత్రరత్నం మరి!

మధు వెలిగిస్తున్నది, ఉపాధ్యాయవృత్తే అయినా, ఉపాధ్యాయులకు ఉండాల్సిన సహనం, ఓర్పు అతనిలో లోపించినయ్. అతని మనస్తత్వమే అంత. అతపిరి ఆడంబరాలు కావాలి. కృత్రిమమైన అంతస్తు కావాలి. నలుగురూ తనని ఉపాధ్యాయుడుగా కాకుండా ఒక వ్యక్తిగా మెచ్చుకోవాలి. అనంతంకి లేని ఈ భావన అతని కొడుకులో అంకురార్పణ జరిగింది. అదే అతని హృదయంలో పేరుకుపోయిన భావన. దాంతో అర్థంలేని దుబారా ఖర్చులు ప్రారంభమయ్యాయి.

అడంబరాలకు బానిసలైన వ్యక్తుల జీవితాలు ఎలా ఛిన్నాభిన్నమవుతాయో ఒక ఉపాధ్యాయుడుగా మధుకి తెలుసు.తెలిసి కూడా అటువంటి జీవితానికి స్వస్తిచెప్పలేకపోతున్నాడు.

అనంతంకి మాత్రం కొడుకు ప్రవర్తన సుతరామూ నచ్చలేదు సరికదా, యెంతో బాధ కలిగించింది. చూస్తూ చూస్తూ మౌనంగా ఉండలేకపోయాడు. తండ్రిగా తన బాధ్యత నిర్వహించాలనుకున్నాడు.

"ఒరేయ్ అబ్బాయ్. నువ్వు అడంబరాలకు బానిస అవుతున్నావు. కొద్దిరోజులుగా నేను గమనిస్తున్నాను. ఇది మంచిది కాదురా. మన సంపాదనకి అనుగుణంగా జీవించడం నేర్చుకోవాలి.

కొంత వెనకేసుకోవాలి. భవిష్యత్తులో అదెంతో ఉపకరిస్తుంది. అప్పుడే జీవితానికి సుఖం, శాంతి ఉంటుంది. ఓ ఉపాధ్యాయుడిగా నువ్వీ విషయాన్ని విస్మరిస్తున్నావేమోననిపిస్తోందిరా" ఉండబట్టలేక ఓ రోజు కొడుక్కి హితవు చెప్పాడు అనంతం.

అయితే, మధుకి తండ్రి చెప్పిన హితవు తలకెక్కలేదు. అతని మనస్తత్వరీత్యా, అతనికి ఇతరులెవ్వరూ సలహాలివ్వకూడదు. తండ్రి అయినా సరే అందుకే, అతని మొహం అకస్మాత్తుగా ఎర్రబడింది. కనుబొమలు ముడిపడ్డాయి. తండ్రికేసి తీక్షణంగా చూసాడు.

"నాకు మీరేం సలహాలివ్వఖ్ఖర్లేదు నాన్నా! నిజానికి మీకు తెలిసిన జీవితమేమిటి? చింకిగుడ్డలు ధరించడం, ఏ ఉపయోగకర వస్తువులూ లేకుండా ఇంటిని ఓ ఎడారిలా వుంచడమేగా? జీవితాన్ని ఎలా అనుభవించడమో మీకేం తెలుసు? మీకు తెలీని జీవితం గురించి నాకు సలహాలివ్వడానికి ప్రయత్నించకండి?" అన్నాడు కటోరంగా.

అనంతం మనస్సు చివుక్కుమంది. అనవసరంగా కలిగించుకుని హితబోధ చేశానేమోనని అతని హృదయం ఆక్రోశించింది, మౌనంగా కొడుకు మనస్తత్వం తెలిసి కూడా అలా కలిగించుకోవడం తప్పేననిపించింది. మరేం మాట్లాడలేదు అనంతం.

అయితే, భర్త దురుసుతనాన్ని సహించలేక పోయింది పారిజాతం. మామగారిని అలా అవమానించినందుకు బాధపడింది. బాధపడి ఊరుకోలేదు.

"మామగారు చెప్పిందాంట్లో తప్పేముందండీ. ఎందుకలా విరుచుకుపడతారు ఆయన చెప్పింది మన మంచికే కదా? మనింటికి ప్రస్తుతానికి ఈ సోఫాసెట్టు, కర్టెన్లూ,గోడలకు ఆ పటాలు.... ఇవన్నీ లేకపోతే, మునిగిపోయిందేముంది చెప్పండి? మన తాహతు కూడా చూసుకోవాలి కదా?" అంది పారిజాతం. మామగారినే వెనకేసుకొస్తూ.

భార్య చెప్పింది రుచించలేదు మధుకి. మొహం అదోలా పెట్టాడు.

"ఆ ముసలాయన్ని వెనకేసుకురావొద్దని నీకు ఎన్నో సార్లు చెప్పాను పారిజాతం. ఆయన అన్నాడూ అంటే పాతకాలపు వాడు కాబట్టి అర్థంవుంది. కాని, నువ్వు ఈనాటి మహిళవు. అధునాతనభావాలు గలదానివి. నువ్వూ ఆ పాత పంథానే అవలంబిస్తుంటే, నాకు జాలివెయ్యడమేకాదు బాధగా వుంది. ఒక్క విషయం ఆలోచించు. ఎవరయినా స్నేహితులు, బంధువులూ వచ్చారనుకో! వాళ్లని గౌరవ పూర్వకంగా కూచోబెట్టగలమా? హంగంటూ ఏమన్నా వుందా చెప్పు? ఈ ఇంటిని చూసి ఎవరయినా స్మశానమనుకుంటారుగాని ఇల్లనుకుంటారా?" విసురుగానే అన్నాడు మధు.

అనంతం, కొడుకు మాటలకి యెంతో ఆవేదన చెందాడని, అతని మొహంలోని రంగులే

చెబుతున్నయ్.

"శివ, శివా! ఒరేయ్, యేవిఁట్రా అఘాయిత్యపు మాటలు? నిండు గృహంలో, పచ్చని యింట్లో యెవరయినా యిట్లాంటి మాటలంటారట్రా?" బాధపడుతూనే అన్నాడు, అనంతం.

మధు, నిర్లక్ష్యంగా చూశాడు.

"అఁ! అన్నంత మాత్రాన, యీ యిల్లు స్మశానమైపోదు లెండి. ఇదిగో, ఆఖరుసారిగా చెబుతున్నాను.. నా విషయాల్లో కలిగించుకోకండి... నా సంసారం.. నా యిష్టం మీరు తెస్తున్న బోడి పెన్షను, మీ ఒక్కరికే చాలదు. అంచేత, నన్ను ప్రశ్నించే హక్కు మీకు లేదని తెలుసుకోండి. ఈ యింట్లో మా దగ్గరుండటం మీకు కష్టంగా వుంటే, యీ యింట్లో మీరు నరకాన్ని అనుభవిస్తున్నారని అనుకుంటే, స్వేచ్ఛలేదని భావిస్తే, హాయిగా మీ మానాన మీరు యెక్కడికయినా పోవొచ్చు. అంతేగాని, తగుదునమ్మా అని నోరెత్తకండి" అన్నాడుకోపంగా.

అనంతం గుండె గుభేలుమంది. ఎవరో గుండెల్ని పట్టి పిండి చేస్తున్నట్టే అనిపించింది. అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లినయ్. కొడుకుచేత, అంతమాట అనిపించుకునేరోజు వస్తుందని అతనెప్పుడూ కలలో కూడా వూహించలేదు. నిశ్చేష్టుడై అలా నిల్చుండి పోయాడు.

పారిజాతం కంగారుపడింది. భర్తకేసి చూసింది. " అవేం మాటలండీ? మావఁయ్యగారు యెంతగా బాధపడతారని? కొడుకు తండ్రిని అనాల్సిన మాటలేనా యివి?" కలిగించుకుని ధైర్యంగా అంది.

మధులో పశ్చాత్తాపం చోటుచేసుకోలేదు. "నువ్వు నోరు మూసుకో పారిజాతం. మనం ప్రేమించుకున్న వాళ్ళం గాబట్టి, నీమీదగల అనురాగంతో నేనూరుకుంటూ వుంటే నువ్వు మరీ పెట్రేగిపోతున్నావు. మా తండ్రీకొడుకుల విషయాల్లోకి తలదూర్చకు. అర్థమయ్యిందా?" వార్నింగ్ యిస్తున్నట్టుగా కరకుగానే అన్నాడు మధు.

పారిజాతం, మరేం మాట్లాడలేకపోయింది.

ఆమె కళ్ళు, అశ్రువులతో బరువెక్కినయ్. మొహం దించుకుంది.

అనంతం, బరువెక్కిన హృదయంతో మౌనంగా బైటికి పోతున్నాడు. ఆయన వాలకం చూస్తే, పారిజాతంకి భయం వేసింది. వుండబట్టలేకపోయింది.

"ఎక్కడికి మావఁయ్యగారూ?" అంది, కంగారుగా.

"అలా వెళ్ళోస్తానమ్మా." అంటూ మెల్లగా సాగాడు అనంతం.

"నువ్వెందుకలా కంగారు పడతావు పారిజాతం? మా నాన్న యెక్కడికీ వెళ్ళడులే! వెళ్ళడానికి

యింకెవరున్నారని? మన దగ్గరే చచ్చినట్టు చచ్చేవరకూ పడుండాలి" అన్నాడు, మధు.

కొడుకు మాటలు వెళ్తోన్న అనంతం చెవిన పడకపోలేదు. పడ్డాయి కాని, యేం చెయ్యగలడు? మరోమారు కళ్ళొత్తుకుని, పార్కుకేసి నడిచాడు. పార్కులో ఓ చివర ఒంటరిగా కూచున్నాడు. చుట్టూ వెల్తురున్నా, తన మనసులో మాత్రం దట్టమైన చీకటి అలముకున్నట్టనిపించింది. అతని మెదడు నిండా ఆలోచనలే. కొడుకు మాటలు, అతని కర్ణపుటాల్లో గింగురు పెడుతున్నయ్. మధు తాను కన్నకొడుకే. అయినా, వాడింత కరకుగా యెందుకు తయారయ్యాడో, తనకీ అర్థం కావడంలేదు... కొడుకు మాటలు తల్చుకుంటే చాలు - హృదయం బావురుమంటోంది. తాను యెంత రిటైరయినా, ముసలితనం తనని కావలించుకుంటున్నా, భార్యను పోగొట్టుకొని జీవితంలో ఒంటరివాడైనా, తనకీ ఆత్మాభిమానం వుందనుకున్నాడు. ఆలోచించి... ఆలోచించి.. ఓ నిర్ణయానికొచ్చాడు. ఆ నిర్ణయానికొచ్చాకనే అక్కణ్ణించి బయల్దేరాడు.

రాత్రి యెనిమిది గంటలు దాటింది. అప్పుడు యింటికి తిరిగొచ్చాడు అనంతం. మావఁయ్య యింకా రాలేదని కంగారుగా యెదురుచూస్తోన్న పారిజాతం, ఆయన్ని చూసి, కుదుటపడింది.

"మీ అబ్బాయి మాటల్ని, మీరేం పట్టించుకోకండి మావఁయ్యగారూ" అంది పారిజాతం, అతని వెంటే లోపలికి వెళ్తూ.

అనంతం, పొడిగా నవ్వేడు. "అబ్బే! నేనేం పట్టించుకోలేదమ్మా. ఎంతయినా, వాడు నా కొడుకే కదమ్మా" అనేశాడు.

మావఁయ్యగారు సర్దుబాటు చేసుకున్నందుకు యెంతో సంతోషించింది. పారిజాతం. అంతవరకూ ఆమె మనసులో చోటుచేసుకున్న అలజడి, తగ్గింది. ఆమె కోరుకున్నది అటువంటి సర్దుబాటునే.

"మీరు కాళ్ళూ, చేతులు కడుక్కుని రండి మావఁయ్యగారూ, భోంచేద్దురుగాని.." అంది.

"అలాగేనమ్మా! వడ్డించు.." అంటూ బాత్రూమ్‌కేసి నడిచాడు అనంతం.

తృప్తిగ లోపలికి నడిచింది, పారిజాతం, వంటగదికేసి.

బాత్రూమ్ నుంచి తిరిగొచ్చిన అనంతం, భోజనానికి కూచున్నాడు. కోడలు వడ్డించిన భోజనాన్ని సుష్టుగా భోంచేశాడు. ఆ యింట్లో, తాను తీసుకుంటున్న ఆఖరి భోజనం అదేనని, కోడలికి తెలీదు పాపం. . అనుకున్నాడు మనసులో. కోడలిని మనసులోనే దీవించుకున్నాడు.

ఆ రోజు రాత్రి, తనకి అవసరమైన వస్తువులన్నీ ఓ సూట్‌కేసులో పెట్టుకుని, యెవ్వరూ చూడకుండా, ఆ యింట్లో నుంచి బైటపడ్డాడు అనంతం....

✪ ✪ ✪

అనంతం ఆలోచనలు ఆగిపోయినై. అతని కన్నీళ్ళు, చెక్కిళ్ళపైకి జాలువారుతూ వుంటే, పంచెతో కళ్ళొత్తుకున్నాడు. ఇంక వుపేక్షించకూడదని, అంత బాధనీ గుండెల్లో దాచుకుని, ఆ చీకట్లో ముందుకు సాగిపోయాడు. అనంతం.

అనంతంలో నిరాశా, నిస్పృహలు నిండుకున్నా, జీవితం పట్ల ఓ విధమైన విరక్తిభావం పుట్టినా, బ్రతుకును పరిసమాప్తం చేసుకోవాలన్న ఆలోచన అతనికి రాలేదు. 'ఆత్మహత్య' పిరికివాళ్ళు చేసే అనాలోచిత ఛర్య అని అనంతం అభిమతం. అందుకే, అటువంటి ప్రయత్నానికి పూనుకోకుండా, నేరుగా రైల్వే స్టేషనుకి నడిచాడు. టిక్కెట్టుకొని, అప్పుడే వచ్చిన పాసింజరు యెక్కేశాడు.

అనంతంకి తెలుసు - తన గురించి వెదికేవారు లేరని. ఆ ఆలోచన కోడలికి వచ్చినా, తన కొడుకు మధు మాత్రం ఆమెనా ప్రయత్నం చెయ్యనివ్వడు.. అని.

✪ ✪ ✪

పట్నం చేరుకున్న అనంతం, కొత్త జీవితాన్ని ప్రారంభించాడు. ఎంతో ప్రయత్నం మీద ఓ ప్రయివేటు స్కూల్లో మళ్ళీ వుపాధ్యాయుడిగా చేరాడు. తనకు తెలిసిన విద్యని నలుగురికి పంచిపెట్టే తన ధ్యేయాన్ని ప్రారంభించాడు మళ్ళీ. అతని జీవితం ఒంటరిదే అయినా, సాఫీగా సాగిపోతోంది. అప్పుడప్పుడూ కొడుకు,కోడలు, జ్ఞాపకానికొస్తున్నా, బలవంతంగా ఆ జ్ఞాపకాల్ని తుడిచేసు కుంటున్నాడు. అతని మెదడులో నిరంతరం మెదిలేవి అతని భార్య స్మృతులే!

✪ ✪ ✪

మావఁగారు యింట్లోనుంచి వెళ్ళిపోయినందుకు యెంతగానో బాధపడింది. పారిజాతం... ఆయనెలా వున్నారో, యెక్కడున్నారోనని కలవరపడింది. కంటతడి పెట్టుకుంది.

అయితే, మధు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా వున్నాడు. తండ్రి, ఆ వయసులో యెక్కడికి పోయాడో, యేమైపోయాడోనన్న ఆందోళన కూడా లేదతనిలో. కన్న కొడుకుగా అతనిలో యింతటి బండ మనస్తత్వం యెలా అబ్బిందో, యెవ్వరూ వూహించలేని విషయం.. ముఖ్యంగా పారిజాతం! భర్త మనస్తత్వాన్ని ఆమె ఆకళింపు చేసుకోలేకపోతోంది.

"మీకేవీఁ పట్టనట్టు, మీ నాన్నగారి విషయంలో అలా వూరుకుంటారేవిఁటండీ?" అడిగింది, పారిజాతం.

"వూరుకోక, యేంచెయ్యమంటావు?" అయిష్టంగా యెదురు ప్రశ్న వేశాడు. మధు.

పారిజాతంకి చిరుకోపం వచ్చింది. ఆమె మొహం హఠాత్తుగా అరుణకాంతిని పుంజుకుంది.

"ఆయన యెక్కడికి వెళ్ళిపోయారో, యేమయ్యారోనన్న ఆరాటం కూడా మీకు లేదంటే, మీరు యెటువంటి తనయులో అర్ధమౌతూనే వుందండీ. ఇంతటి కర్కశహృదయం మీదని, నాకు తెలీదండీ" యేహ్యాభావంతో, నిష్ఠూరంగా అందామె.

భార్య మాటలు, మధు అంతరంగంలో యెక్కడో చుర్రుమనిపించాయి. తండ్రి అంటే, తన కెందుకంత క్రోధమో, కసో, ఆమెకేం తెలుసు?.. అనుకున్నాడు లోలోన. "నువ్వనుకుంటున్నట్టు, కర్కశ హృదయం నాది కాదు పారిజాతం.. మా నాన్నది! ఆ కర్కోటకుడంటే, అందుకే నాకు కసి... క్రోధం.." ఆవేశంగానే అన్నాడు. మదు

పారిజాతం, నివ్వెరపోయింది. భర్త అలా అన్నందుకు. మావఁయ్యగారు నవనీత హృదయులని ఆమెకి తెలుసు. అయితే, భర్త ఆయన గురించి అలా అంటారేవిఁటి?. . అనుకుంది లోలోన. ఆమె తనలోతాను వేసుకున్న ప్రశ్నకి సమాధానం దొరకలేదు. బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"ఏవిఁటండీ మీరంటున్నది? మీ నాన్నగారు కర్కోటకులా? మీకేం మతిగాని పోయిందా యేవిఁ టి?"

మధు, పొడిగా నవ్వేడు. "నాకేం మతిపోతేదు పారిజాతం. కాని, మా నాన్నగారు నాపట్ల చూపిన అనాదరణ.అనురాగ రహిత వాత్సల్యం, యెటువంటివో వింటే, నీకే మతిపోతుంది.."

"అంటే..?"

"చెబుతాను.. వివరంగా చెబుతాను... చిన్నప్పుడు, మా వూరి బడిలోనే చదివాను. అయిదో క్లాసు అయ్యాక, పట్నంలో చదువుతానన్నాను.. పంపించారుకాదు, చిన్నవయస్సని. స్కూలు ఫైనల్ పాసయ్యాక యింటరు చదవడానికి తప్పని సరిగ పట్నం వెళ్ళాను. ఇంటరు ఫస్టుక్లాసులో పాసయ్యాను. మెడిసిన్ చదివి, డాక్టరవ్వాలన్న తపన వుండేది నాలో. అందుకే మెడిసిన్ చదువుతానన్నాను. ప్రవేశ పరీక్షకు వెళ్తానన్నాను.. వీల్లేదన్నారు మా నాన్న. ఆ ఖర్చు భరించలేనన్నారు. అప్పుచేసి చదివిస్తే. తర్వాత నేను తీర్చుకుంటానని హామీ యిచ్చాను. అబ్బే, ఆయన వినలేదు. నా గోడు పెడచెవిన పెట్టి, నన్ను బి.ఏలో చేర్చారు. తర్వాత, బి.ఇ.డి చేయించారు. నిజానికి నాకు యీ మాష్టరీ వృత్తి నచ్చనిది. అయినా సరే, మా నాన్న బలవంతం వల్ల చదవక తప్పలేదు. అప్పుడీ వుద్యోగంలో చేరాను. ఈ వుద్యోగంలో యేం బావుకుంటాం చెప్పు? నాకు నచ్చని యీ వుద్యోగంలో నేను చేరడానికి కారకులు మా నాన్నగారే. నేను అభివృద్ధిలోకి రాకపోవడానిక కారణం మా నాన్నగారు కాదంటావా? అందుకనే, మా నాన్నంటే, నాకు అసహ్యం. మా అమ్మ పోయిన తర్వాత, నా విషయమే పట్టించుకోవడం మానేశారు. తన వుద్యోగం, తన జీవితమే పరమావధిగా బ్రతికారాయన,

ఇప్పుడు చెప్పు.. ఆయనంటే, నాకెలా అభిమానం వుంటుందని?" అంటూ తన వ్యతిరేకతకి కారణాలు వెళ్ళడించాడు. మధు.

పారిజాతం, భారంగా ఓ నిట్టూర్పు విడిచింది. భర్త, ఆయన తండ్రి పట్ల యెంత తెలివితక్కువగా, మూర్ఖంగా ప్రవర్తించారో, ఆమెకి అర్థమయ్యింది.

"మీరు చెప్పింది విన్నాక, నాకేం మతిపోలేదుగాని, మీ మూర్ఖత్వం బైటపడిందండీ. అనాలోచితంగా, ఆవేశంతో మీ నాన్నగారి పట్ల ఓ విధమైన ద్వేషభావాన్ని యేర్పర్చుకున్నారేగాని, ఆయన పరిస్థితులు, ఆయన దృక్పథంలోని నిజాలు, గ్రహించలేకపోయారండీ.. అందుకు నేను చాలా బాధపడుతున్నాను.." అంది నిశ్చలంగా.

"అంటే, యేవిఁటి నీ వుద్దేశం?" మామూలు ధోరణిలోనే అన్నాడు పారిజాతంని అమితంగా ప్రేమిస్తున్నాడు గాబట్టి, అతనికా తరుణంలో కోపం రాలేదు.

" ఆ రోజుల్లో మీ నాన్నగారి ఆర్థిక పరిస్థితుల్ని మీరు ఆలోచించినట్లు లేదండీ. ఇప్పుడంటే, వుపాధ్యాయుల బ్రతుకులు మెరుగుపడ్డాయిగాని, ఆ రోజుల్లో ఆయన సంసారభారాన్ని మోసేందుకు యెన్ని కష్టాలు పడ్డారో మీరు అవగాహన చేసుకోలేదేమోనని, నా అభిప్రాయం. చిన్నప్పుడు మీరు కోరినా, పట్నంలో చదివించలేదు. డాక్టరు కావాలన్న మీ తపనకి రూపకల్పన చెయ్యలేదు. అప్పుచేసి అయినా మెడిసిన్ చదివించమని మీరు కోరినా, ఆయన చదివించలేదు. మీ తల్లిగారు పోయాక, మిమ్మల్ని గాలికి వదిలేశారు. ఇవేగా మీ నాన్నగారిపై మీ అభియోగాలు?" అంది సూటిగా భర్త మొహంలోకి చూస్తూ. పారజాతం.

"ఔను. అవే! ఆయన వల్లనే నా భవిష్యత్తు కుంటుపడింది."

"అని, మీరనుకుంటున్నారండీ! కాని, మీ నాన్నగారి ఆలోచనల దృష్ట్యా ఆయన చేసింది సబబే! అప్పులు చేసి డాక్టరీ చదివించడమంటే తమాషాలా? తీరా మీరు డాక్టరయ్యాక. యే డాక్టరమ్మనో పెళ్లాడి, మీ నాన్నగారికి దూరంగా పోతే, ఆయన పరిస్థితి యేవిఁటి? మీ అమ్మగారు పోవడం, మీ నాన్నగారికో పెద్ద 'షాక్' . ఆ షాక్ నుండి ఆయన తేరుకోకనే, మీ గురించి అంతగా పట్టించుకుని వుండకపోవచ్చు. అయినాసరే. ఆయన మిమ్మల్ని బి.ఇడి చదివించారు. ఇప్పుడు మీరు చేస్తున్న వుపాధ్యా వుద్యోగం, అందరికీ అందుబాటులో లేదన్న నిజాన్ని గ్రహించకపోవడం శోచనీయం. తక్కువ సంపాదనలోనే, అవకాశమున్నంత మేరకు మిమ్మల్ని చదివించారు. జీవితంలో తృప్తి అన్నది వుండాలండీ! లేకుంటే, ఆశలకు అంతుండదు..".

"ఏవిఁటి నువ్విలా అంటావు.." అసహనంగా అన్నాడు మధు.

"నేను చెప్పింది వాస్తవమండీ. ఆ 'తృప్తి'ని ఆలంబన చేసుకునే మీ నాన్నగారు జీవించారు. అలా జీవించారు గాబట్టే, రిటైరయ్యాక, యీ 'ఇల్లు' కొనగలిగారు.." అని పారిజాతం చెప్పుపోతూవుంటే, మధు చప్పున అడ్డొచ్చాడు.

"ఆ! కొన్నారు.. యీ ముష్ఠి కొంపని..' యీ సడింపుగా అన్నాడు.

"అలా అనకండి. ఈ కొంపకూడా లేనివాళ్ళు దేశంలో యెంతమంది వున్నారో ఒక్కసారి యోచించండి. అప్పు చేసి, 'అత్యాశలతో చదువులు చదివించినవారి బ్రతుకులు యెలా మారుతున్నాయో, మీకు తెలీదా? అనుభవజ్ఞులు గనకనే, ఆ మార్గాన్ని యెన్నుకోలేదు, మీ న్నాగారు.. అవకాశం వున్నంతలో మీకు మంచినే చేశారు. కాని, యేం లాభం? ఆయన మంచితనాన్ని, మీరు అర్థం చేసుకోలేకపోయారు. ఆయన్ని మొదట్నుంచీ వ్యతిరేకిస్తూ ద్వేషభావాన్ని పెంచుకున్నారు. మిమ్మల్ని ఆ దేవుడు కూడా క్షమించడండీ! తండ్రీగా ఆయన తన కర్తవ్యాన్ని నిర్వర్తించారు. కాని, కొడుకుగా మీరు మీ బాధ్యతని యెంతవరకూ నిర్వహించారని? ఎదుటి వ్యక్తి చేసినదాన్ని యెత్తి చూపడం కాదండీ! మనం యేం చేశామన్నదీ ఆలోచించాలి." గంభీరంగా అంది పారిజాతం.

మదు ఆలోచనలో పడ్డాడు. ఆత్మ విమర్శ చేసుకున్నాడు. భార్య చెప్పిన మాటలు, సబబుగానే వున్నాయేమోననిపించిందతనికి. మరేం మాట్లాడలేక మొహందించుకున్నాడు.

భర్తలో మార్పు గమనించి మురిసిపోయింది పారిజాతం.

"మీ న్నాగారు యిప్పుడెక్కడున్నారో యెలా వున్నారో తల్చుకుంటేనే హృదయం ద్రవించుకుపోతోందండీ. ప్రపంచం మిమ్మల్నేం తప్పుపట్టదండీ! ఏవిధంగానూ నిందించదు. కాని నేనీ యింటి కోడలిగా వచ్చిన కొద్దిరోజులకే ఆయన వెళ్ళిపోయినందుకు, యే పాపమూ యెరుగని నన్ను నిందిస్తుందండీ. యీ లోకం... ఇది దృష్టిలో పెట్టుకుని ఆయన కోసం వెదకండి. వాకబు చెయ్యండి.." కంట తడిపెట్టుకుంటూ అంది పారిజాతం.

మధు పశ్చాత్తప్తుడై తన తప్పును తెలుసుకున్నాడు. కోడలిగా ఆమెకున్న పాటి అభిమానం, అప్యాయత, కొడుకుగా తనకి లేనందుకు బాధపడ్డాడు. సిగ్గుపడ్డాడు కూడా. అతని గుండెల్లో ఎవరో చేయిపెట్టి కెలికినట్టుయ్యింది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఐయామ్ సారీ పారిజాతం. తప్పునాదే. ఆలస్యంగా తెలుసుకున్నాను. కాని ఆయన కోసం యెక్కడని వెదకడం?" అన్నాడు బొంగురుపోయిన స్వరంతో.

"ప్రయత్నించండి. మీ స్నేహితులకు, బంధువులకు వుత్తరాలు రాయండి. మీరు ఓసారి పట్నం వెళ్ళి వెదకండి. అవసరమనుకుంటే నేనూ వస్తాను..."

అలాగే అన్నట్టు తలాడించాడు. అతని నోట మాటలు రాలేదు. తండ్రి పట్ల తాను అకారణంగా అసందర్భంగా, అన్యాయంగా, ప్రవర్తించినందుకు సిగ్గుపడ్డాడు.

✪ ✪ ✪

మధు, తండ్రి వునికిని తెలుసుకునేందుకు అన్ని ప్రయాత్నాలూ చేశాడు. కానీ ఫలితం లేకపోయింది.

రోజులు గడుస్తున్నాయ్...

ఓ రోజు దినపత్రికలో తండ్రి ఫోటో చూసి ఆశ్చర్యపోయాడు.

ఉత్తమ వుపాధ్యాయునిగా అనంతంకి అవార్డు వచ్చిన సందర్భంలో వేసిన ఫోటో అది. పట్నంలోని స్కూలు పేరు వివరాలు వేశారు. గతంలో ఆయన విద్యారంగంలో చేసిన సేవలకు ప్రతిఫలమే ఆ బహుమతి.

మధు దంపతుల ఆనందానికి అవధుల్లేకపోయాయి. ఆ ఇద్దరి నయనాల నుండి ఆనంద భాష్పాలు రాలినాయి. "ఆయన కొడుకుగా మీరు, కోడలిగా నేను, గర్వించాలండీ.." అంది పారిజాతం.
"నిజమే పారిజాతం."

"రేపే పట్నం వెళ్దామండీ.."

"అలాగే.."

మర్నాడే పట్నం వెళ్ళారు మధు దంపతులు. స్కూలుకి వెళ్తే యింట్లో వున్నారని చెప్పి, యిల్లు చూపించారు స్కూలువారు. ఇంటికి వెళ్లి తలుపు తట్టింది పారజాతం.

అనంతం తలుపు తెరిచాడు. ఎదురుగా కొడుకుని, కోడల్ని చూశాడు. అతని హృదయం వుప్పొంగిపోయింది. ఆనందభాష్పాలు, అతని కళ్ళల్లోంచి తొంగి చూస్తున్నాయి.

"నన్ను క్షమించండి నాన్నా చాలా దురుసుగా ప్రవర్తించాను.." బావురుమంటూ తండ్రి పాదాలపై పడ్డాడు మధు.

అనంతంకి కావల్సిందింకేముంది! సజల నేత్రాలతో కొడుకుని లేవనెత్తి, హృదయానికి హత్తుకున్నాడు. "ఏవమ్మా పారిజాతం, బావున్నావా?" అన్నాడు. యిద్దర్నీ చెరో చేత్తో లోపలికి తీసుకుపోతూ అనంతం.

"మా మాటకేం. మీరు బావున్నారు కదా?" అంది పారిజాతం.

"ఏదోనమ్మా యిలా వున్నాను కూచోండి"

మీరట్లా చెప్పా పెట్టకుండా వచ్చేసినందుకు సంజాయిషీ అడిగే హక్కు నాకు లేదుగాని, మేం యెంతగా బాధపడ్డామో, ఆలోచించారా మావయ్యా?" రుద్ధస్వరంతో అంది పారిజాతం.

"ఆవిషయాన్ని మళ్ళీ గుర్తు చెయ్యకమ్మా అదో పీడకల అనుకుందాం."

"సరే మావయ్యగారూ అలాగే అనుకుందాం అయితే, మీరు మాతో పాటు వచ్చేయాలి అందరం ఒకేచోట వుందాం."

"ఔను నాన్నా! మీరు మా దగ్గరే వుండాలి.." మధు కూడా అన్నాడు. అనంతం, చల్లని మందహాసం చిందించాడు.

"దానికేముందిరా అబ్బాయ్! నీలో మార్పు వచ్చింది. అదే నాకు పదివేలనుకో నేను వుపాధ్యాయ వృత్తిలో యెంతో ఆనందాన్ని తృప్తిని పొందుతున్నాను. ఆ ఆనందానికి దూరం కాలేనురా. దగ్గర్లోనే వున్నాంగా బట్టి, తరువాత కలుసుకుందాం" సంతృప్తిగా అన్నాడు అనంతం. అతని కళ్లల్లో కొత్త కాంతి కనిపిస్తోంది.

'ఇప్పుడీ వుపాధ్యాయ వుద్యోగం మీకంత అవసరమంటారా మావయ్యా?" మెల్లగా అన్నది పారిజాతం.

"ఆర్థికపరంగా అవసరమని నేననన్నమ్మా కాని, నాకూ యేదో వ్యాపకం వుండాలి కదా. స్కూల్లో నన్నందరూ అభిమానిస్తున్నారు. గౌరవిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నేనిక్కణ్ణించి వెళ్ళిపోవడం బావుండదు కదా! వీలు చూసుకుని మా వాణ్ణి ఇక్కడికి బదిలీ చేయిస్తాను. అందరం కలిసే వుండొచ్చు.."

పారిజాతం మొహం విప్పారింది. "మీరెంతో మంచివారు మావయ్యా...?" అంది పులకించిపోతూ. "అలా అనకమ్మా? నీ మంచితనమే మనల్నిలా కలిపింది. నువ్వు నిజంగా మా ఇంట్లో సువాసనలు వెదజల్లే పారిజాతానివేనమ్మా! అన్నట్టు మర్చాను వెళ్ళి వంట ప్రారంభిద్దాం.. మన ముగ్గురం కలిసి భోజనం చేద్దాం.." అంటూ లేవబోయాడు అనంతం. "మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి మావయ్యా! నేను త్వరగా వంట పూర్తిచేస్తాను.." అంటూ వంట గదికేసి దారితీసింది పారిజాతం.

అనంతం మధు, పరస్పరం చూసుకొని నిండుగా నవ్వుకున్నారు. దూరం నించి వారిద్దరూ అలా నవ్వుకోవడం చూసి మురిసిపోయింది పారిజాతం.

□□□ (ఈనాడు ఆదివారం మే -3-1992